సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరమని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ నియోజవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 19 మంది లబ్ధిదారులకు రూ.7,20,000 విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే వేలాది మంది కుటుంబాలు సీఎంఆర్‌ఎఫ్ కింద లబ్ధిపొందాయని అన్నారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారందరికీ నిధులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, శంకర్ ముదిరాజ్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, కొండా శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, సాయికృష్ణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ముఠా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్

కాచిగూడ: అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ అందజేశారు. 10 షాదీముబారక్ చెక్కులు, 8 కల్యాణలక్ష్మి చెక్కులను నాంపల్లి తహసీల్దార్ ఎం.ప్రేమ్‌కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు జి.రామన్‌గౌడ్, ప్రియారాజ్, మాధవి, మహేష్, అక్షిత్ జైస్వాల్,రమేష్, సందీప్, శేఖర్, జగదీష్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: విద్యార్థి దశలోనే కంటి సమస్యలను గుర్తిస్తే భవిష్యత్‌లో కంటి సమస్య తీవ్రతను నివారించవచ్చని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం వాంబేకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కార్పొరేటర్ కళ్లద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం



కాచిగూడ: కరాటే సాధనతో క్రమశిక్షణతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని హెల్త్‌లీగ్ కార్యదర్శి శ్రీశాంతి స్వరూప్ లీలే అన్నారు. సోమవారం కాచిగూడ హెల్త్ లీగ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడ్ టెస్ట్‌లో విజేతలైన 25 మంది విద్యార్థులకు ఆయన కలర్ బెల్ట్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సుజన్‌కు ప్రతిష్ఠాత్మక బ్లాక్‌బెల్ట్ జపాన్ డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ముకుంద్, నవీన్‌నాయక్, కృష్ణ, గోపాల్, శ్రీకాంత్, దామోదర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని ఆప్ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ధనిక రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణ విద్యారంగంలో దేశంలో చివరిస్థానంలో ఉండటం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ ప్రాముఖ్యతను గుర్తించి విద్యకు అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూసివేత నిర్ణయాన్ని తక్షణమే నిలిపేసి ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించి వాటిని బలోపేతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలను విడుదల చేసి రాష్ట్ర విద్యా కమిషన్ రిపోర్టును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నింబోలిఅడ్డలో, బండల బస్తీలో, విక్రమ్‌నగర్‌లో నీరులేకపోవడంతో నిరుపయోగంగా మారిన నీళ్ల ట్యాంక్‌లు





మౌలానా ఆజాద్‌నగర్ బస్తీలో ట్యాంక్‌కు అనుకుని పెట్టిన రేకులు



శివాజీనగర్‌లో, విక్రమ్‌నగర్ బస్తీలో, లింగంపల్లిలో, చెప్పల్‌బజార్‌లో నిరుపయోగంగా చేతిపంపులు






ఇప్పుడైనా పట్టించుకోండి.!

● కాచిగూడ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా, లో-ప్రెషర్‌తో సమస్యలు ● మరుగున పడిన చేతిపంపులు(బోరింగ్), నీళ్ల ట్యాంకులు



జలమండలి నారాయణగూడ జీఎం రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: వేసవి ప్రారంభంలోనే బస్తీవాసులను తాగునీటి సమస్య 'కన్నీళ్లు' పెట్టిస్తోంది. కాచిగూడ డివిజన్ పరిధిలోని బస్తీల్లో 'పానీ'–పాట్లు మొదలయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. సరిపడా నీళ్లు రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు విడిచి రోజు నీళ్లు సరఫరా అవుతుండటంతో నీళ్లు వచ్చిన రోజున వీరు విధులకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. ప్రతి నెలా తాగునీటి బిల్లులు వసూలు చేస్తున్నా జలమండలి అధికారులు నీటి సమస్య పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు.

పబ్లిక్ బోర్ల నిర్వహణ అధ్వానం..

పబ్లిక్ బోర్ల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. ప్రజల నీటి అవసరాలను తీర్చడానికి లక్షలాది రూపాయల ప్రజా ధనంతో వేసిన పబ్లిక్ బోర్లు ప్రజలకు ఉపయోగం లేకుండా పోయాయి. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితులలో పేద ప్రజలంతా బిందెలు, బకెట్లు పట్టుకొని బోరు బాట పట్టారు. కాగా తమ సమీపంలోని బోర్లు పనిచేయకపోవడంతో బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పనిచేయని నీళ్ల ట్యాంకులు..

కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని వీటిని ఏర్పాటు చేశారు. నిర్వహణ మాత్రం అధికారులు మరిచారు. రోజు తాగునీటి ట్యాంకర్ల ద్వారా జలమండలి సిబ్బంది నీళ్ల ట్యాంకులను నింపుతారు. వీటిని స్థానికులు పట్టుకుని నీటి అవసరాలను తీర్చేందుకు వీటిని ఏర్పాటు చేవారు. కాగా కేవలం కొన్ని రోజుల వరకే ఇవి పనిచేశాయి. లక్షల రూపాయలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసిన శ్రద్ధ తరువాత కనిపించడం లేదు. ఫలితంగా మురికివాడలు, బస్తీల్లో నీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రమవుతున్నా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోవడం గమనార్హం. ఏటా ఇదే రకంగా జరుగుతోంది. ఈసారి వేసవి ఎండలు మరింత తీవ్రంగా ఉండే అవకాశముంది. వేసవి తీవ్రతరం కాకముందే ట్యాంకుల నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

లోప్రెషర్‌తో తాగునీటి సరఫరా..

తాగునీటి సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించి నీటి సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. డివిజన్‌లోని చెప్పల్ బజార్, మణియార్ పట్టి, మోతీమార్కెట్, సునార్ లేన్, కుద్బిగూడ తదితర ప్రాంతాల్లో కొంత కాలంగా లోప్రెషర్‌తో నీటి సరఫరా కావడంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

నీటి సమస్యను పరిష్కరించండి..

తాగునీటి సరఫరాలో అంతరాయం, నల్లాల్లో లోప్రెషర్ సమస్యతో పాటు కలుషిత నీటి సరఫరా జరుగుతోంది. కార్పొరేటర్ ఉమారాణి ఇటీవల జలమండలి నారాయణగూడ జీఎం రామకృష్ణను కలిసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అయినా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



కాచిగూడ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో నల్లాల నుంచి కలుషిత నీరు, మరికొన్ని బస్తీల్లో లో–ప్రెషర్ సమస్య ఉన్నట్లు ఇటీవలనే మా దృష్టికి వచ్చింది. మొన్ననే జలమండి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులకు వివరించాం. స్థానిక అధికారులు మరోసారి సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఇలాగే ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– ఉమారాణి, కాచిగూడ కార్పొరేటర్

బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సోమవారం తెలంగాణ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి అందుకు ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీకి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కాచిగూడలో మాట్లాడుతూ.. వ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు పోరాటం చేస్తున్న బీసీలందరి సమష్టి విజయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని అన్నారు. ఈ బిల్లు ద్వారా స్థానిక సంస్థలు, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలవుతాయని పేర్కొన్నారు. తెలంగాణ బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కోసం ఈ నెల 19వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు న్యాయస్థానాల్లో ఆటంకాలకు అవకాశం ఉన్నందున దీనిని భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో అఖిలపక్ష ఎంపీల మద్దతు కూడగడతామని అన్నారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలన్నారు. కేంద్రంలో విద్యా,ఉద్యోగాలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయాలి



ప్రభుత్వ చీఫ్‌విప్ ఐలయ్యకు వినతి పత్రం ఇస్తున్న చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేయాలని తెలంగాణ చేతి వృత్తుల సమన్వయ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్యకు సోమవారం కమిటీ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అదే విధంగా రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్‌లో అనంతరాములు కమిషన్ సిఫార్సుల మేరకు అమలవుతున్న వర్గీకరణ మాదిరిగానే స్థానిక సంస్థల్లోనూ వర్గీకరణ ఉండాలని కోరామని తెలిపారు. అత్యంత వెనకబడిన సంచార, వృత్తి కులాలకు రాజకీయంగా అవకాశాలు లేకుండా పోయాయని చెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ పైళ్ల ఆశయ్య, పల్లపు విఘ్నేష్, చెన్నారం మల్లేష్, గుమ్మడి రాజు, నరేష్, మరియాల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లు ప్రవేశపెట్టడం సాహసోపేత నిర్ణయం

బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ



నల్లకుంట: తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడంపై బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళీ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం సాయంత్రం నల్లకుంట రత్నానగర్‌లోని బీసీ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అదే సమయంలో కామారెడ్డిలో జరిగిన సభలో కాగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం సాహసోపేత నిర్ణయమని అభివర్ణించారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే కేంద్రానికి పంపాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలి



ముషీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేసి బీఆర్‌ఎస్‌ను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి పార్టీ అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి ఆయను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, పూసగోరక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం, బీబీఏ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఏటీసీవో మాజీ చైర్మన్ డి.గోపాల్‌నారాయణ్, మాజీ వైస్ చైర్మన్ పి.సంపత్‌కుమార్, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కె.ప్రభులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం సమాజంలో వస్తు సేవల వినియోగం పెరగడం వల్ల కల్తీ కూడా పెరిగిందన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగంగా కన్స్యూమర్ కోర్టుకు కూడా వెళ్లవచ్చని తెలిపారు. కొనుగోలు విషయంలో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కల్తీ జరిగే విధానాన్ని పాలు, తేనెను తీసుకొని ప్రయోగరూపకంగా విద్యార్థులకు చూపించారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సమన్వయకర్తగా కామర్స్ విభాగాధిపతి అనిత జైస్వాల్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రమావత్‌శ్రీను, బీబీఏ విభాగాధిపతి విరాల సంతోషి, అధ్యాపకులు కోల ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

● మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు ● నిఘా నీడలో పరీక్ష కేంద్రాలు



ముషీరాబాద్: ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల పరిధిలో మొత్తం 23 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. తరగతి గదుల్లో వెలుతురు, విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండే విధంగా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే పరీక్షా పత్రాలు మండల పరిధిలోని స్టేషన్లకు చేరుకున్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు విద్యాశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

పరీక్షలు రాయనున్న 4807మంది..

మండల పరిధిలో 4807 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు. అందులో 2363 మంది బాలురు, 2444 మంది బాలికలు పరీక్షలకు హాజరు కానున్నారు. మండల పరిధిలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 332 మంది ఉన్నారు. ఎయిడెడ్ పాఠశాలకు చెందిన వారు 464 మంది ఉన్నారు. ప్రైవేటుతో పాటు రెసిడెన్షియల్‌కు చెందిన 4011 మంది ఉన్నారని తెలిపారు.

గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి..

10వ తరగతి పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు 8.30 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. ప్రతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి తరగతి గదులను పరిశీలించాం. పరీక్షలు అంటే భయం పోయేలా విద్యార్థులకు ప్రముఖులతో అవగాహన కల్పించాం. విద్యార్థులు పరీక్షల్లో రాణించే విధంగా రివిజన్‌తో పాటు స్పెషల్ క్లాసులు తీసుకున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకున్నాం.

– శ్రావణ్‌కుమార్, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈఓ

ఇక చిమ్మ చీకట్లు ఉండవు

● అంధకారం సమస్యపై స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు
● జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ మినీ హైమాస్ట్ లైట్ల ఏర్పాట్లు

సాక్షి ఎఫెక్ట్





చిక్కడపల్లి: 'రాత్రయితే చాలు చిమ్మ చీకట్లే.!'అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ డీఈ అశోక్‌కుమార్ స్పందించారు. దీంతో సోమవారం సిబ్బంది బాలునాయక్, రాజునాయక్, గాంధీనగర్ కార్పొరేటర్ పావనితో సదరు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం మినీ హైమాస్ట్ లైట్లను కొత్తవి ఏర్పాటు చేశారు. గాంధీనగర్ డివిజన్‌లోనే అతి పెద్ద జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పరిసరాల్లో అంధకారం నెలకొందని కార్పొరేటర్ తెలిపారు. ఇప్పుడు ఆ సమస్య ఉండదని ఆమె తెలిపారు. కమ్యూనిటీహాల్‌లో కనీస సౌకర్యాలు కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. వాచ్‌మెన్‌ను కూడా నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంధకారాన్ని వెలుగులోకి తీసుకొచ్చి సమస్యను పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ ముదిరాజ్, స్ట్రీట్‌లైట్ సూపర్‌వైజర్ బాలునాయక్, నేతలు ఆకుల సురేందర్, జ్ఞానేశ్వర్, అరుణ్‌కుమార్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

బిల్లు ఆమోదించిన రోజు.. మాల జాతికి చీకటిరోజు

డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్



కాచిగూడ: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన రోజు దళితులకు, ప్రధానంగా మాల జాతికి చీకటి రోజు (బ్లాక్ డే) అని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత కులాల భవిష్యత్‌కు సంబంధించిన వర్గీకరణ అంశంపై విస్తృతంగా చర్చించకుండా అసెంబ్లీలో ఆమోదించడంతో రాజ్యాంగం ఖూనీ అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీలోని అన్ని దోపిడీ కుల పార్టీలు దళితులను అణిచివేయడం కోసం ఏకమయ్యారని ఆరోపించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక మీద కనీసం చర్చించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లును ఆమోదించి మెజార్టీ దళిత కులాలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. వర్గీకరణపై హైకోర్టులో పలు రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆగమేఘాల మీద వర్గీకరణ బిల్లును ఆమోదించడం వెనుక రాజకీయ, సామాజిక కుట్ర దాగి ఉందన్నారు. మాలల భవిష్యత్‌ను దెబ్బతీయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహానికి ఆ పార్టీని తెలంగాణలో బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు, సంకు శ్రీనివాసులు, జేఎస్ రావు, గోలి నరేష్, మద్దిల ప్రవీణ్‌కుమార్, చుపర్తి సుబ్బారావు, అక్కిదాసు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బిల్లును వ్యతిరేకించే పార్టీలను రాజకీయ సమాధి చేస్తాం

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బీసీల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లును రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించే పార్టీలను రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. దేశంలోనే మొదటిసారిగా బీసీ రిజర్వేషన్ బిల్లు తెలంగాణలో ఆమోదం పొందడం చరిత్ర నిలిచిపోతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రిజర్వేషన్ బిల్లుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పన్నుల వాటాలను పెంచాలి

లిబర్టీ: పన్నుల వాటాల్లో కోత దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయటాన్ని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణస్వరూప్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక పక్క పన్ను వాటాలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుంటే మరోపక్క కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రాలకు చెందాల్సిన పన్ను ఆదాయాలను వాటాలను తగ్గించాలని చూస్తుందని ఆరోపించారు. పన్ను ఆదాయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. 40శాతం పన్నుల వాటాను కుదించాలని నిర్ణయించడాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుతం కేంద్ర పన్నుల వాటాను 41శాతం చెల్లిస్తుందని స్పష్టం చేశారు.